RNI Reg-No. APTEL/2002/07373

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

Postal Registration No.VJ/215/2025-27

సంపుటి :24 Vol. No.24 సంచిక : 154 Issue No. 154 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: మంగళవారం 02-06-2026 Tuesday, June 02 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## రాష్ట్రంలో అలజడుల సృష్టికి వైసిపి కుట్రలు

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**నంద్యాల, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ దుష్ట రాజకీయాలకు పాల్పడు తుందని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి మిగతా 2లో..



# ఎన్డీఏ కూటమి వరుస విజయాలు సాధించాలి

అందుకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలి: తునిలో టీడీపీ కార్యకర్తలతో చంద్రబాబు

**కాకినాడ, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్డీఏ కూటమి వరుస విజయాలు సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. 'పార్టీయే సుప్రీం.. కార్యకర్తే నాయకుడు' అనే సిద్ధాంతంతో ప్రతి ఒక్కరూ పార్టీ సైనికుడిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం మిగతా 2లో..

## ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ

రైల్వే జోన్ కల సాకారమయ్యింది

రైల్వేజోన్ రాకతో ఉత్తరాంధ్రకు మహర్దశ

ఇచ్ఛాపురం సంబరాల్లో కేంద్రమంత్రి రామ్మోహన్




**శ్రీకాకుళం, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కోరిక.. రైల్వే జోన్ సాకారమైందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్నో పోరాటాల ఫలితమే దక్షిణ కోస్తా రైల్వే అని తెలిపారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త జోన్ ఏర్పాటుతో లక్షలమంది ప్రయాణికులకు లబ్ది చేకూరుతుందన్నారు. రైల్వేను అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతోనే కృషి చేసినట్లు చెప్పారు. 'రైల్వే జోన్ కోసం పార్లమెంట్‌లో నిరంతరం మాట్లాడా. ఇచ్ఛాపురం బ్రిడ్జి సమస్యకు కూటమి ప్రభుత్వంలోనే పరిష్కారం లభిస్తుంది. బ్రిడ్జి మాత్రమే కాకుండా అండర్ బ్రిడ్జిపైనా దృష్టి సారిస్తాం. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌ను రూ.12 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. ఇచ్ఛాపురం అంటే మూలన ఉండేది కాదు.. ముఖ ద్వారం కాబోతోంది. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ఉత్తరాంధ్ర ప్రజల తరపున ధన్యవాదాలు అని మిగతా 2లో..

## జేబుదొంగలతో జాగ్రత్త

రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ జూన్ 1 (ఆర్ఎన్ఎ):** సీబీఎస్ఈ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై కేంద్రం, సీబీఎస్ఈని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి టార్గెట్ చేశారు. మూల్యాంకన ప్రక్రియలో చేసిన తప్పుల నుంచి సీబీఎస్ఈ లాభపడుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన విద్యార్థులతో ముచ్చటించిన వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా షేర్ చేశారు. "జేబుదొంగలు ఉన్నారు జాగ్రత్త. వారు సీబీఎస్ఈ కార్యాలయంలో తిష్ట వేశారు. సీబీఎస్ఈ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే.. దానికి మీకు బిల్లు పడుతుంది. అదెలాగంటే..

- డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్ట్‌కు రూ.100
- ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ.100
- రి-ఎవాల్యుయేషన్ మిగతా 2లో..

## ముఖ్యమంత్రిగా కాదు సేవకుడిగా ఉంటా

తమిళనాడు సీఎం విజయ్




**చెన్నై, జూన్ 1 (ఆర్ఎన్ఎ):** తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ మొదటిసారి బహిరంగ ర్యాలీలో పాల్గొన్నారు. తిరుచ్చిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో తన పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా ప్రజల సేవకుడిగా పని చేస్తానన్నారు. భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లోనూ ప్రజల మద్దతు లభిస్తుందని దృఢంగా నమ్ముతున్నానని అన్నారు. ఎన్నికల్లో తన విజయాన్ని దివంగత ముఖ్యమంత్రి ఎంజీఆర్ విజయంతో పోలుస్తున్నారని విజయ్ పేర్కొన్నారు. కానీ తాను అంత గొప్ప నేతతో పోల్చుకోవట్లేదని.. ఎంజీఆర్, అన్నా, పెరియార్ చూపిన మార్గంలో పని చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదన్నారు. డీఎంకే- అన్నాడీఎంకేపై విజయ్ విమర్శలు గుప్పించారు. ఆరు నెలలపాటు మౌనంగా ఉంటామని చెప్పినవారు.. ఆరు రోజులు కూడా మౌనంగా ఉండలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. కుటుంబ రాజకీయాల వల్లే డీఎంకే ఎన్నికల్లో ఓటమి చవిచూసిందన్నారు. ఇన్నేళ్లుగా వంతులవారీగా మోసం మిగతా 2లో..

## పెన్షన్ల కోసం రూ.65,886.57 కోట్లు విడుదల

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

సత్యవరంలో పెన్షన్లు పంపిణీ చేసిన హోంమంత్రి అనిత




**విజయనగరం/అనకాపల్లి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం గంట్యాడ మండలం గింజేరులో కూటమి నాయకులతో కలిసి మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మిగతా 2లో..

## జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు


రెండున్నర లక్షల మందిని భాగస్వాములను చేస్తాం

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి



**అమరావతి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీలో జూన్ 7 నుంచి 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ సారి 2.5 లక్షల మందిని యోగా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు చెప్పారు. రాష్ట్రంలో సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేయాలని, వెస్టర్న్ బైపాస్‌లో 25 వేల మందితో యోగా కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పొదుపు చర్యల్లో భాగంగా 30 రోజుల నుంచి 15 రోజులకు కుదించినట్లు తెలిపారు. జూన్ 21న ప్రధాన యోగా కార్యక్రమం వెస్టర్న్ బైపాస్ రోడ్డుపై నిర్వహించాలనే దానిపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులు, బీఆర్ అంబేద్కర్ మిగతా 2లో..

## రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు నోటిఫికేషన్



**న్యూఢిల్లీ జూన్ 1 (ఆర్ఎన్ఎ):** ఏపీ సహా 10 రాష్ట్రాల్లోని రాజ్యసభ స్థానాలకు, మూడు రాష్ట్రాల శాసన మండలి స్థానాలకు ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించింది. జూన్, జులైలో 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. ఈ స్థానాలతో పాటు పదవీకాలం ముగియకుండానే ఖాళీయైన మూడుస్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో మొత్తం 27 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ మిగతా 2లో..

## మేలో రికార్డు స్థాయిలో తిరుమలకు భక్తులు

శ్రీవారిని దర్శించుకున్న 25,46,168 మంది భక్తులు

రూ.120.28 కోట్ల ఆదాయం సమకూర్చినట్లు టీటీడీ వెల్లడి



**తిరుమల, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో మే నెలలో రికార్డు స్థాయిలో భక్తులు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ యేడాది ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. మే మాసంలో రికార్డు స్థాయిలో తిరుమల శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు కావడం, విద్యా సంస్థలకు విరామం రావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీటీడీ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మే నెలలో తిరుమలలో రికార్డు స్థాయి దర్శనాలు, కానుకలు, తలనీలాలను భక్తులు సమర్పించారు. మే మాసంలో తిరుమల శ్రీవారిని 25,46,168 మంది భక్తులు దర్శించుకున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది మే నెలలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, స్వామివారిపై ఉన్న భక్తి శ్రద్ధలతో భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సర్వదర్శనం మిగతా 2లో..

## వైఎస్ విగ్రహ ధ్వంసం గొడ్డలి పార్టీ కుట్ర

ఆపార్టీ కార్యకర్తతో చేయించి, కూటమిపై నెట్టే యత్నం

నంద్యాల ఘటనపై మంత్రి అనగాని ఘాటు విమర్శలు



**అమరావతి, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నంద్యాలలో వైఎస్ విగ్రహం విధ్వంసం ఘటనపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ కార్యకర్త జంబులయ్యతో తీయించి.. దాన్ని టీడీపీ మీద నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జంబులయ్య భార్యకు మెప్మాలో గత ప్రభుత్వంలో ఉద్యోగం ఇచ్చారని... మిగతా 2లో..

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# తెలంగాణ మేధావులు ఆలోచించాలి!

తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగు పడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రైవేటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఆ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్‌ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.

# నెల్లూరు నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం

**ఒకేరోజు ముగ్గురు మహిళల మెడగొలుసులు చోరీ**

నెల్లూరు,జూన్1(ఆర్ఎన్ఎ): నెల్లూరు నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం సృష్టించారు. ఒకే రోజు ముగ్గురు మహిళల మెడల్లో బంగారు గొలుసులను అపహరించడం తీవ్ర కలకలం రేపింది. జేమ్స్ గార్డెన్, పడరుపల్లి, చిల్డన్స్ పార్క్ ప్రాంతాల్లో దుండగులు బరితెగించారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు సాగాయి. మొత్తం 9 సవర్ల బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు నవాబుపేట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఒకే రోజు మూడు ప్రాంతాల్లో దుండగులు చోరీకి పాల్పడటం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. చైన్ స్నాచర్లను వెంటనే పట్టుకోవాలని వారు కోరుతున్నారు.

# ముగిసిన ఐపిఎల్2026 సంబరం

## వరుసగా రెండోసారి కప్పు రాయల్ ఛాలెంజర్స్ వశం... కొత్త క్రికెటర్ల ప్రతిభను వెలికితెచ్చిన ఐపిఎల్

**న్యూఢిల్లీ, జూన్ 1 (ఆర్ఎన్ఎ):** దాదాపు రెండునెలల పాటు సాగిన ఐపిఎల్ 2026 సంబరం ముగిసింది. ఎందరో క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా యువ క్రికెటర్లు ఎంతోమంది తమ సత్తా చాటారు. వైభవ్ సూర్యవంశీ లాంటి వారు భవిష్యత్ ఇంటియా టీమ్‌కు తురుపుముక్కలా కనిపించినట్లే. దాదాపు రెండున్నర నెలల పాటు అభిమానులు సమ్మర్ ఎంజయ్ చేశారు. ఆదివారం సాయంత్రం అహ్మదాబాద్‌లో జరిగిన ఐపీఎల్ ఫైల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం సాధించింది. వరుసగా రెండో సారి ఐపీఎల్ ట్రోఫీ సాధించింది. గుజరాత్ టైటాన్స్ నిర్దేశిరచిన 156 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో గుజరాత్ టైటాన్స్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించిన ఆర్సీబీ వరుసగా రెండో ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఐపీఎల్ 2026 ఫైల్ పోరులో గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' విరాట్ కోహ్లీ 75 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటీదార్ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు. విరాట్ కోహ్లీపై ప్రశంసల వర్షం కురిపించాడు. దాంతోపాటు ట్రోఫీని ఈసారి కూడా అభిమానులకే అంకితం చేస్తున్నట్లు వెల్లడించాడు.'కోహ్లీ గురించి చెప్పడానికి నాకు మాటలు రావడం లేదు. కెరీర్‌లో



అతడు సాధించలేనిది అంటూ ఏమీ లేదు. విరాట్ ఎంత గొప్ప ఆటగాడో కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. మైదానంలోనే కాదు.. బయట కూడా అతడి నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. జట్టులోని ప్రతి ఆటగాడితో మాట్లాడుతుంటాడు. క్రికెట్‌కు సంబంధించిన విషయాలే కాకుండా జీవితానికి ఉపయోగపడే అంశాలపై కూడా సూచనలు ఇస్తుంటాడు. నేను ఎప్పుడూ విరాట్‌ను గమనిస్తూ ఉంటాను. నెట్స్‌లో అతడు చూపించే ఉత్సాహం, మ్యాచ్‌లో కనిపించే ఎనర్జీ ఒకేలా ఉంటాయి. అదే కోహ్లీ ప్రత్యేకత' అని పాటీదార్ వెల్లడించాడు. ఈ సీజన్‌లో విరాట్ 675 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరుసగా రెండో కప్పును సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. ఫైనల్ కోసం ఇక్కడికి వచ్చాక గతేడాది జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఎలా ఆడామో.. ఇప్పుడు కూడా అదే దూకుడును ప్రదర్శించాం. జట్టులోని ప్రతి బౌలర్‌ను నేను మెన్షన్ చేయాలి. కెప్టెన్‌గా ఇక్కడ నా ప్రయాణం అద్భుతం. గతేడాది మాపై తీవ్ర ఒత్తిడి ఉండేది. కానీ ఈసారి అంచనాలు ఉన్నప్పటికీ ఒత్తిడి లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడాం. తొలి మ్యాచ్ నుంచే దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాం. మేం ఎక్కడికి వెళ్లినా అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ప్రోత్సహించారు. వారి కోసం ఏం చేసినా తక్కువే. ఈ సలానూ కప్ నమ్దు.. ఈ సారి కూడా ట్రోఫీని అభిమానులకే అంకితం చేస్తున్నా' అని పాటీదార్ వెల్లడించాడు. ఇదిలావుంటే వరుసగా రెండో టైటిల్ సాధించిన ఆర్సీబీ జట్టుకు, ఆటగాళ్లకు, కోచింగ్ సిబ్బందికి కర్నాటక కాబోయే సిఎం శివకుమార్ అభినందనలు తెలిపారు. జట్టు అద్భుత ప్రదర్శనతో మరోసారి ఛాంపియన్‌గా నిలవడం కర్ణాటక ప్రజలకు గర్వకారణమని ప్రశంసించారు. విరాట్ కోహ్లీ వేగవంతమైన అర్ధశతకంతో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును గెలిపించాడు. అయితే ఐపీఎల్ ఫైనల్ వేదికపై కర్ణాటక కాబోయే శివకుమార్ అసహనం వ్యక్తం చేశారు. ఆర్సీబీ ఫ్యాన్స్‌కు అన్యాయం జరిగిందని అన్నారు. ఫైనల్ మ్యాచ్ బెంగళూరులో జరగాల్సింది. కొన్ని కారణాల వల్ల మ్యాచ్‌ను మరో వేదికలో నిర్వహించారు. ఆర్సీబీ అభిమానులకు అన్యాయం జరిగింది. దీనిపై ఎక్కువగా మాట్లాడదలచుకోలేదు' అని శివకుమార్ పేర్కొన్నారు.

# ఆంధ్రా ప్రజలతో ఎప్పుడూ పేచీ లేదు

**పేచీ కేవలం అక్కడి నాయకులతోనే... ఇక్కడ వేలు పెడతా..గరిటె తిప్పుతామంటే తిప్పి కొడతాం**

**పవన్ కళ్యాణ్‌కు టీఆర్ఎస్ అధినేత్రి కవిత ఘాటు హెచ్చరిక**



**హైదరాబాద్,జూన్1(ఆర్ఎన్ఎ):** ఆంధ్రా ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ ఇరాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. 'ఆంధ్రా, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవు... ఆంధ్రా రాజకీయ నాయకులతోనే మన పంచాయితీ అన్నారు. ఆంధ్రా రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆంధ్రా వాళ్ల విగ్రహాలు పెడుతున్నారు. తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారు.. దాని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని కవిత అన్నారు. 'మేం అధికారంలోకి ఖచ్చితంగా వస్తాం. ఇక్కడ ఉన్న విగ్రహాలు కూల్చుతాం. తెలంగాణలో సెటిలర్స్ అంతా మావాళ్లే. రావచ్చు.. పోవచ్చు.. రొయ్యలు అమ్ముకోవచ్చు.. షూటింగ్‌లు చేసుకొని పోవచ్చు. సెక్రటేరియట్‌లో ఏపీ నాయకులు గంటె తిప్పుతామంటే ఊరుకోం. మేము టీఆర్ఎస్ 2.0 అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునేది లేదు' అని కవిత హెచ్చరించారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో టీజీ జనసేన నేతలతో పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఈ క్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత పవన్ కళ్యాణ్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని కవిత అన్నారు. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నా మని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పొలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా పట్టివేత

**11మంది నిర్వాహకుల అరెస్ట్**

**హైదరాబాద్,జూన్1(ఆర్ఎన్ఎ):** తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై సీఐడీ చీఫ్ చారు సిన్హా ఆధ్వర్యంలో కీలక ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భారీ నెట్‌వర్క్ కార్యకలపాలను బట్టబయలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న ఆన్‌లైన్ బెట్టింగ్ గేమింగ్ మాఫియాపై చేపట్టిన ఈ చర్యల్లో మొత్తం 11 మంది నిర్వాహకులను అధికారులు అరెస్టు చేశారు. వీరిలో తెలంగాణకు చెందినవారితో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు కూడా ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై తెలంగాణ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిందని సీఐడీ చీఫ్ చారుసిన్హా వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులను సీఐడీకి బదిలీ ఆయిన కేసులను విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కేసు పూర్తి వివరాలను చారుసిన్హా మీడియాకు వెల్లడించారు. కరీంనగర్‌లో నమోదైన డాఫా బెట్ కేసును ఛేదించామని తెలిపారు. 46 మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్‌ను సీజ్ చేశామని చెప్పుకొచ్చారు. ఈ కేసులో ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా ఆర్గనైజర్లు రోజుకు రూ.8 నుంచి రూ.10 లక్షలు సంపాదిస్తున్నారని అన్నారు. 40 మంది అధికారులు ఈ కేసును విచారణ చేశారని వెల్లడించారు. 15 రోజుల సీఐడీ ఆపరేషన్‌లో ఢిల్లీ, గుజరాత్, పంజాబ్‌లో 11 మందిని అరెస్ట్ చేశారని చెప్పారు. ఇది ఒక ఇంటర్నేషనల్ బెట్టింగ్ దందా అని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో దేశవ్యాప్తంగా ఆపరేషన్ చేసి నిందితులను అరెస్ట్ చేశామని చారుసిన్హా వివరించారు. ఈ డాఫా బెట్‌పై 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు, 73 క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్లపై 414 కేసులు నమోదు చేశామని వెల్లడించారు. 108 ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్‌లను గుర్తించి కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల సమన్వయంతో 37 ఆన్‌లైన్ బెట్టింగ్ అప్లికేషన్లు ఉన్నాయని వివరించారు. తెలంగాణలో మాత్రమే అందుబాటులో ఉండేలా జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 25 మంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కౌన్సెలింగ్ చేశామని అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలు , సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఒక్క ఛాన్స్ ఇచ్చామని చెప్పారు. వారికి కౌన్సెలింగ్ చేశామని, మళ్లీ రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలో 414 కేసులు నమోదు చేశామని, 108 బెట్టింగ్ యాప్‌లు బ్లాక్ చేశామని సీఐడీ చీఫ్ చారుసిన్హా పేర్కొన్నారు.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆత్మహత్య

**అదనపు కట్నం వేధింపులే అంటున్న కుటుంబ సభ్యులు**

**లక్నో,జూన్1(ఆర్ఎన్ఎ):** పెళ్లైన రెండేళ్లకే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లఖ్‌నవూకు చెందిన సాగర్ రాజ్‌పుత్‌కు 2024లో కాన్పూర్‌కు చెందిన మాన్షితో పెళ్లయింది. మాన్షి తల్లిదండ్రులు వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం బాగానే సాగింది. ఇద్దరూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సాగర్‌కు ఇన్‌స్టాలో 8 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కలిసి వీడియోలు చేసే వారు. ఏమైందో ఏమో తెలీదు కానీ, మాన్షి అత్తింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి మరణంపై మాన్షి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదనపు కట్నం కోసం తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. 'పెళ్లి సమయంలో వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చాం. అయినా వాళ్లకు సంతృప్తి కలగలేదు. అదనపు కట్నం కోసం నా కూతురిని హింసిస్తున్నారు. కారు కావాలని అడుగుతున్నారు. తక్కువ కట్నం తెచ్చిందని అంటూ మాన్షిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు'.. వేధింపుల గురించి మాతో చెప్పుకుని మాన్షి చాలా ఏడ్చేది. మాన్షి అత్తింటి వారికి సర్ది చెప్పటం కోసం పలుమార్లు లఖ్‌నవూ వెళ్లి వచ్చాము. మా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని శనివారం ఫోన్ కాల్ వచ్చింది. మా కూతురిది ముమ్మాటికీ హత్యే. మాన్షిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు' అని అన్నారు. పోలీసులు సాగర్‌తో పాటు మరో ఐదుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# బార్‌లో యువకుల మధ్య గొడవ

**యువతని కారుతో ఢీకొని చంపిన దుండగులు**

చెన్నై,జూన్1(ఆర్ఎన్ఎ): ఓ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ 18 ఏళ్ల యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన చెన్నై నగరంలో చోటుచేసుకుంది. నిందితులైన బాలమురుగన్ (21), జోశ్వ (19), కిషోర్ కుమార్ (19) లను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విల్లుపూరం జిల్లాలో నివాసం ఉండే యాన్సీ, ఆమె స్నేహితులు చెన్నైలోని ఓ ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా.. అక్కడే ఉన్న మరో పురుషుల బృందం వాగ్వాదం పెట్టుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్ద ఘర్షణగా మారింది. ఈ క్రమంలోనే బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు సర్ది చెప్పి బయటకు పంపించారు. బార్ బయట వెళ్లిన తర్వాత కూడా వారి మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. బౌన్సర్లు కూడా మరోసారి రంగంలోకి దిగి రెండు వర్గాలను అక్కడి నుంచి వెళ్లిపోమని కోరారు. దీంతో యాన్సీ, తన స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై తన నివాసానికి బయలుదేరింది. మార్గం మధ్యలో వారి బైక్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**అమెరికా దళాల దాడులతో మొదటికొచ్చిన వ్యవహారం**

**వాషింగ్టన్,జూన్1(ఆర్ఎన్ఎ):** శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి. ఆత్మరక్షణ కోసం ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను



తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫైటర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి. హర్మూజ్‌ను నియంత్రించాలంటే ఇరాన్ ఖేష్మ్ మిసైల్ సిటీని కూడా ధ్వంసం చేయడం అమెరికాకు చాలా ముఖ్యం. ఇక్కడ అండర్‌గ్రౌండ్ సిటీలో యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులు ఉన్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు. గడా 380, హెచ్‌వై-2 సిల్క్‌వార్మ్‌ను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఇక బాలిస్టిక్ క్షిపణుల్లో 800 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖియామ్-1, ఖైబర్ షెకన్, ఫత్ర, ఎమాద్ మిసైల్స్‌ను భద్రపర్చింది. వీటితోపాటు వేగంగా దాడి చేసే స్పీడ్‌బోట్స్, తీరప్రాంత క్షిపణి బ్యాటరీలు కూడా ఉన్నాయి.

# గొల్లపూడి వాటర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



విజయవాడ , జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. గొల్లపూడిలోని వాటర్ ఫిల్టర్ బెడ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భం గా ఫిల్టర్ బెడ్ పనితీరు, నీటి శుద్ధి ప్రక్రియ (ప్యూరిఫికేషన్ ప్రాసెస్) గురించి అక్కడి అధికారులను, ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గొల్లపూడి నుండి జక్కంపూడి వద్ద నూతనంగా నిర్మించిన టిడ్కో గృహాలకు త్వరలోనే సురక్షితమైన కృష్ణా జలాలను సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, ఫిల్టర్ బెడ్ నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నీటి శుద్ధి ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఒక్కొక్క ఉద్యోగాన్ని 15 లక్షలకు అమ్ముకున్న కూటమి ప్రభుత్వం

### మెగా డీఎస్సీ లోలి జరిగిన అవకతవకలపై లోకేష్ మంత్రి పదవికిలి లిరాజీనామా చెయ్యాలి




పల్నాడు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌లి లిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లి గోపిరెడ్డి శ్రీనివాస్రెడ్డి

పల్నాడు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై స్థానిక పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి మెగాడీఎస్ లో జరిగిన అవకాతవకలపై కలెక్టర్ కి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మరియు రాష్ట్ర ,జిల్లా, నియోజకవర్గ మరియు పట్టణ యూత్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ పూర్తి అవకతవకల మయమని, అవినీతితో నిండిపోయిందని ..మెరిట్ లిస్టులో ఉన్న టీచర్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా లక్షల రూపాయలకు దొడ్డి దారిన ఉద్యోగాలు అమ్ముకున్నారని... మీరు నిజాయితీగా డీఎస్సీ నిర్వహిస్తే మెరిట్ లిస్టు ఎందుకు ప్రకటించలేదని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు? కేవలం ఉద్యోగాలు వచ్చిన వారికే ఎస్ఎంఎస్ మెసేజ్లు పంపించి వారిని ఉద్యోగాలలో జాయిన్ చేసుకున్నారని, గత వైఎస్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చిన్న ఉద్యోగం ఇచ్చిన వారం రోజుల ముందు మెరిట్ లిస్టు ప్రకటించామని, మీరు ప్రస్తుతం మెరిట్ లిస్టు లేకుండా ఇన్ని వేల ఉద్యోగాలు ఎలా ప్రకటించారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రశ్నించారు ? స్పోర్ట్స్ కోటాలో సుమారు 420 ఉద్యోగాల్ని ఒక్కొక్క ఉద్యోగం 15 లక్షల చెప్పుకున్న మీరు అమ్ముకున్న మాట వాస్తవం కాదా? లోకేష్ గారు... అని ప్రశ్నించారు! కేంద్రం ప్రకటించిన స్పోర్ట్స్ కోటాలో అర్హులైన శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాసులకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు ? క్రీడా మైదానం అంటే ఏమిటో తెలియని వాళ్లకు కూడా లక్షలాది రూపాయల డబ్బులు తీసుకొని ఉద్యోగాలు అమ్ముకున్నారని, ఇది అవినీతి కాదా ?అని ప్రశ్నించారు! లోకేష్ బాబు .....నీకు దమ్ము, ధైర్యం ఉంటే డీఎస్సీలో జరిగిన అవకతవకలపై ప్రజల ముందుకు వచ్చి దగాపడ్డ నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలని... తప్పు చేసింది నీవైతే ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ చేత ఎలా ప్రెస్ మీట్ పెట్టిస్తావని ...సమాధానం చెప్పాల్సిన బాధ్యత నీదేనని.. ఉద్యోగాలు అమ్ముకున్నది నీవేనని.. ఉద్యోగాలు నీవు అమ్ముకుంటే ప్రభుత్వ అధికారి ఎలా సమాధానం చెబుతాడని.. నీకు సమాధానం చెప్పే దమ్ము ధైర్యం లేదా అని ప్రశ్నించారు? డీఎస్సీ మీద అవకతవకలపై ప్రశ్నిస్తున్నందుకే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారిపై కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తున్నాయని, ఈ సందర్భంగా తెలియజేస్తూ ... పది సంవత్సరాలుగా టీచరు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ మెరిట్ లిస్టులో ఉన్నవారు ఉద్యోగాలు కోల్పోయారని, తక్షణమే మెరిట్ లిస్టు ప్రకటించి డీఎస్సీ రాసిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు .డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై తక్షణమే సిబిఐ దర్యాప్తు లేదా రిటైర్డ్ హైకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలని, డిఎస్సి లో జరిగిన భారీ అవకతవకలపై ప్రభుత్వ అధికారి ప్రెస్ మీట్ పెట్టి సమాధానం చెబితే సరిపోదని, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నువ్వే ప్రజల ముందుకు వచ్చే సమాధానం చెప్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారిని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు మరియు నిరుద్యోగయి యువత భారీగా పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ లో 65 ఫిర్యాదులు నమోదు



పల్నాడు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ జే వి సంతోష్ పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 65 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

# మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థలో 1318 రకం విత్తనాలు పంపిణీ



ఆచంట జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : అధిక ఉష్ణోగ్రతల కారణంగా వాయిదా పడిన ఎంటియూ 1318 రకం విత్తనాల అమ్మకాలను మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ సోమవారం నుండి తిరిగి ప్రారంభించింది. సంస్థ సహ సంచాలకులు సి. హెచ్. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, విత్తనాలు కోరుకునే రైతులు ఉదయం 9:00 నుండి 11:30 వరకు, మరియు మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు పరిశోధన సంస్థ వద్ద కొనుగోలు చేయవచ్చు. ఈ సమాచారాన్ని ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.

# విద్యార్థులకు శుభవార్త: డైట్ ఛార్జీల పెంపునకు ఏపీ ప్రభుత్వం కసరత్తు!



విజయవాడ , జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 6.52 లక్షల మంది విద్యార్థులకు మరింత నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. ఇందులో భాగంగా విద్యార్థుల డైట్ ఛార్జీలను పెంచేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ ఛార్జీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 990 కోట్లు ఖర్చు చేస్తోంది. తాజాగా దీనిని 10% లేదా 15% మేర పెంచాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 10% పెంచితే: ఏడాదికి అదనంగా రూ. 99 కోట్లు భారం పడుతుంది. 15% పెంచితే: అదనంగా రూ. 148 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఈ ప్రతిపాదనలపై వారం లేదా పది రోజుల్లో ప్రభుత్వం నుండి తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. అంతా అనుకూలిస్తే ఈ ఏడాది జూన్ లేదా జులై నెలల నుంచి పెరిగిన డైట్ ఛార్జీలు అమలులోకి రానున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే లక్షలాది మంది విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందనుంది.

# కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ లో 152 అర్జీలు స్వీకరణ

### జిల్లా రెవిన్యూ అధికారి నారదముని



పల్నాడు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : పల్నాడు జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు, జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా రెవిన్యూ అధికారి నారదముని అర్జీలను స్వీకరించారు. - ఈ సందర్భంగా ప్రజల నుంచి 152 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు క్యూ జిల్లారెవిన్యూ అధికారి ఆదేశాలు జారీ చేశారు.

- ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీలను సత్వరం అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. ఆయా శాఖల అధికారులు గడువులోపు అర్జీలను పరిష్కరించడం చేయాలన్నారు. ప్రతిరోజు అర్జీలను మానిటర్ చేయాలని, గడువు తీరకముందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చేయాలని ఆదేశించారు. అర్జీలను ఎలాంటి పెండింగ్ ఉంచరాదని, పెండింగ్ ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ అర్జీలను ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆదేశించారు.

# పంట బోదుల్లోకి దిగి ఉపాధి శ్రామికులకు మజ్జిగ అందజేసిన మంత్రి నిమ్మల



పాలకొల్లు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : పాలకొల్లు మండలంలోని వేలివెల గ్రామంలో ఉపాధి హామీ శ్రామికులకు మంత్రి నిమ్మల రామానాయుడు మజ్జిగను అందజేశారు. పంట బోదుల్లోకి దిగి అందులో పనిచేస్తున్న శ్రామికులకు స్వయంగా అందజేశారు. వేసవి మండుటెండలో పనిచేస్తున్న వారికి ప్రతిరోజు మజ్జిగను దాతలు సహకారంతో తెదేపా శ్రేణులు అందజేయాలని మంత్రి నిమ్మల ఇచ్చిన పిలుపుతో గ్రామ గ్రామాన ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి ఒక్కరితో మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ మీకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్వచ్ఛమైన పల్లెల్లో మంచి మనసుతో మెలిగే ప్రజలంటే తనకు మమకారం అని, ఆ ఉద్దేశంతోనే గత ఏడాది వేసవిలో మజ్జిగను అందజేయడంతో శ్రామికులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారని, దీంతో ఈ ఏడాది కూడా కొనసాగేలాగా పిలుపునిచ్చానన్నారు. ఉపాధి శ్రామికులకు మజ్జిగ నా అందజేయడం తనకు ఎంతో సంతృప్తి, ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు.

# గుంతకల్లు లో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

గుంతకల్లు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : గుంతకల్లు పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సంక్షేమం మరియు సంక్షేమ పథకాల పట్ల ప్రభుత్వం ఎంతో నిబద్ధతతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 3000 నుంచి రూ. 4 వేల వరకు పింఛన్లను పెంచి లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు.

# శ్రీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యంయల్ఏ శ్రీరాం రాజగోపాల్ కి వినతి....


### పద్మశాలి కులస్తుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన యంయల్ఏ శ్రీరాం రాజగోపాల్




జగ్గయ్యపేట జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : జగ్గయ్యపేట పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు అల్లి లక్ష్మీ కిశోర్,కార్యదర్శి భారత జగన్ ల ఆధ్వర్యంలో పద్మశాలి కులస్తుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) కి వినతిపత్రాన్ని సమర్పిం చడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలో పద్మశాలి కులస్తులు 2000 గడపలలో నివసిస్తున్నారు .పద్మశాలి కులస్తులు జగ్గయ్యపేట పట్టణంలో శుభ కార్యక్రమాలు చేసుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కుల వృత్తిని వదులుకొని బట్టల మూట వ్యాపారం, టైలరింగ్,గుమాస్తాలుగా జగ్గయ్యే ఎట లో మా కులస్తులు పని చేసుకుంటున్నారు. పాత గడ్డ ప్రాంతంలో పద్మశాలి వంశీయులు ఎక్కువగా ఉన్నందున వారి కుల వృత్తికి సంబంధించిన రాట్రాని, మార్కండేయ విగ్రహ ఏర్పాటుకు అవకాశం కల్పించాలి. స్మశాన వాటిక ప్రకృతి విలయ తాండవంతో స్మశానం పాడైపోయి ఇబ్బందులు పడుతున్నారు. పద్మశాలీ కులస్తులను దృష్టిలో ఉంచుకొని ఫంక్షన్ హాలు కి స్థలాన్ని కేటాయించాలని, కుల ధృవీకరణ ఆధారంగా 50 సంవత్సరాలు దాటిన వారికి చేనేత ఫించన్ ఇప్పించగలరని, పాడైన స్మశాన వాటికకు ప్రభుత్వం నుండి బడ్జెట్ ని కేటాయించి పునః నిర్మాణం చేయాలని, పద్మశాలి వంశీయులు రాష్ట్రంలో అధికార పార్టీ వెంబడే ఉన్నందున, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు శ్రీయుత నారా లోకేష్ మంగళగిరిలో పద్మశాలి కులస్తులను ఆదుకుంటున్న విధంగా జగ్గయ్యపేట పట్టణం లో కులస్తులను తమరు ఆదుకొని పై విషయాల పరిష్కరించి న్యాయం చేయాలని కోరాడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్(తా తయ్య) కుల సంఘం వారితో పద్మశాలి కులంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ని,ఇన్ ఛార్జి కమీషనర్ శివ కోటేశ్వరరావు ని కలవడం జరిగింది. ఈ కార్యక్ర మంలో కుల పెద్దలు మేక వెంకటేశ్వ ర్లు,యేశాల సీతారామమూర్తి,పెనుమల్లి చంద్రమౌళి, గోసిక శ్రీనివాసరావు,చెరుపల్లి నాగరాజు,గజ్జం నాగశివ రాం,యం శ్రీనివాసరావు,వివి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయం

### ఎంఈవో విజయకుమారి పదవీ విరమణ సభలో మంత్రి కొండపల్లి



విజయనగరం జూన్ 1 (మెట్రో వాయిస్ న్యూస్) ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయమైనదని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని రామవరం సూర్యా ఫంక్షన్ హాల్ లో జరిగిన మండల విద్యాశాఖ అధికారి 1 గా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న బంటు విజయ కుమారి అభినందన సభ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయకుమారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ఉద్యోగాలన్నింటిలో ఉపాధ్యాయ వృత్తి బాధ్యతయుతమైనదని, నేటి సమాజంలో రాజకీయ, చిత్ర రంగ, పలు ఉద్యోగాలలో రాణిస్తున్న విద్యార్థులను తయారు చేసే సత్తా ఒక ఉపాధ్యాయ వృత్తికే ఉన్నదన్నారు. విజయ కుమారి ఉద్యోగ విధులలో ఎంతో బాధ్యతయుతంగా పనిచేస్తారని, విధులలో అలసత్వం నిర్వహించే వారి పట్ల ఎంతో కఠినంగా వ్యవహరించే వారని, క్రమశిక్షణతో సమయపాలన పాటించాలని తమ క్రింది స్థాయి ఉద్యోగులకు సూచించేవారని ఆమె వ్యక్తిత్వం, దృఢ సంకల్పం సమాజానికి దిక్సూచిని కలగ చేస్తుందని మంత్రి ఆమె సేవలను కొనియాడారు. పదవి విరమణ అనంతరం ఆమె శేష జీవితం ఆరోగ్యంగా, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాద్యాయ శాసన మండలి సభ్యులు గాదె శ్రీనివాసులనాయుడు పలువురు ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట



వలూరు జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. సోమవారం కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహానాడులో ప్రకటించిన 33శాతం రిజర్వేషన్‌తో మహిళలకు అత్యున్నత ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో కోవూరు నియోజకవర్గానికి రూ. 13 వేల కోట్ల పెట్టుబడులతో భారీ పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. దీనివల్ల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. నిరుద్యోగ నివారణకు ఇప్పటికే 16 వేల పోస్టులతో 'మెగా డీఎస్సీ' ప్రకటించామని చెప్పారు. కాగా, ఇళ్ల స్థలాల కోసం స్థానికులు సమర్పించిన అర్జీలపై ఎమ్మెల్యే తక్షణమే స్పందిస్తూ.. ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని అక్కడికక్కడే తహసీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, రెవెన్యూ అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఏఎస్పి



పుట్టపర్తి జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) : పుట్టపర్తిలోని ఏఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురాణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి, సంబంధిత అధికారులకు పంపి, సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## అక్కినేని కోడలు విమర్శలను జయిస్తుందా?



ఇంట గెలిచి రచ్చ గెలవాలి అని ఒక సామెత. కొందరు మాత్రం రచ్చ గెలిచి, తర్వాత ఇంటికి వస్తుంటారు. శోభిత ధూళిపాళ్ల ఈ కోవకే చెందుతుంది. ఈ వైజాగ్ అమ్మాయి నేరుగా బాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ మంచి పేరు సంపాదించింది. అక్కడ ఆమె చేసిన సినిమాలు, వెబ్ సిరీస్‌లు విజయవంతం అయ్యాయి. తర్వాత 'గూఢచారి' చిత్రంతో ఆమె సొంత ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆపై 'మేజర్' మూవీలోనూ తళుక్కుమంది. తెలుగులో నటిస్తూనే తమిళంలో లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం ప్రెస్టీజియస్ మూవీ 'పొన్నియన్ సెల్వన్'లో అవకాశం దక్కించుకుంది. ఐతే అందులో శోభిత చేసిన రాణి పాత్ర విషయంలో తీవ్ర విమర్శలు తప్పలేదు. రాణిగా ఆమె లుక్స్ ఏమాత్రం సూట్ కాలేదు. నటన విషయంలోనూ విమర్శలు వచ్చాయి. 'పొన్నియన్ సెల్వన్' సినిమానే చాలా ట్రోలింగ్ ఎదుర్కోగా.. శోభిత మీద మరింత ఎక్కువ నెగెటివిటీ కనిపించింది. మామూలుగా మణిరత్నం సినిమాలో నటించిన కథానాయికకు ఆ చిత్ర ఫలితంతో సంబంధం లేకుండా తర్వాత అవకాశాలు వరుస కడతాయి. కానీ శోభిత మాత్రం చాలా ఏళ్ల పాటు తమిళంలో మరో అవకాశం అందుకోలేకపోయింది. కానీ అక్కినేని నాగచైతన్యను పెళ్లి చేసుకుని, మొత్తంగా సినిమాలు తగ్గించేసుకున్న టైంలో ఒక స్పెషల్ మూవీలో ఛాన్స్ అందుకుంది శోభిత. తమిళంలో కొత్త తరం గ్రేట్ డైరెక్టర్లలో ఒకడిగా పేరు సంపాదించిన పా.రంజిత్ దర్శకత్వంలో శోభిత నటిస్తోంది. దినేష్, ఆర్య ముఖ్య పాత్రలు పోషిస్తున్న 'వేట్టువం' చిత్రంలో శోభితనే కథానాయికగా నటిస్తోంది. పా.రంజిత్ చిత్రాల్లో సోకాల్డ్ హీరోయిన్ పాత్రలు ఉండవు. లేడీ క్యారెక్టర్లు కూడా హీరోకు దీటుగా నిలుస్తాయి. ఎక్కువగా గ్రామీణ నేపథ్యంలో సినిమాలు చేసే రంజిత్.. ఈసారి అర్బన్ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా చేస్తున్నాడు. ఇందులో శోభిత కూడా మోడర్న్ గర్ల్ రోలే చేస్తోంది. తన ఫస్ట్ లుక్‌ను తాజాగా లాంచ్ చేశారు. తన పాత్ర కచ్చితంగా కెరీర్లో ప్రత్యేకంగా నిలిచిపోయేదిగా ఉంటుందని భావిస్తున్నారు. 'పొన్నియన్ సెల్వన్'తో వచ్చిన విమర్శలన్నింటికీ ఈ సినిమాతో శోభిత బదులిస్తుందనే అంచనాలున్నాయి. ఈ సినిమా చిత్రీకరణలోనే ఒక ఫైట్ మాస్టర్ ప్రాణాలు కోల్పోవడంతో 'వేట్టువం' ఇంతకుముందు వార్తల్లో నిలిచింది. చిత్రీకరణ చివరి దశలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకు వస్తుంది

## అర్జున్ మార్కెట్ బ్రతికే ఉంది



ఒకప్పుడు యాక్షన్ కింగ్ గా మాస్ ప్రేక్షకులకు బాగా దగ్గరైన హీరో అర్జున్. తెలుగులో మా పల్లెలో గోపాలుడు లాంటి హిట్లు చాలానే ఉన్నప్పటికీ జెంటిల్ మెన్ తర్వాత ఆయన ఇమేజ్, మార్కెట్ అమాంతం పెరిగిపోయాయి. అప్పట్లో ఒకే ఒక్కడుకి తమిళనాడులో కంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువ కలెక్షన్లు వచ్చిన విషయాన్ని ట్రేడ్ గుర్తు చేసుకుంటూ ఉంటుంది. ఇంత వయసు వచ్చినా బాడీ ఫిట్ నెస్ విషయంలో కుర్రాళ్లతో పోటీ పడటం ఆయన ప్రత్యేకత. అలాంటి అర్జున్ చాలా సంవత్సరాలుగా సపోర్టింగ్ రోల్స్ ఎక్కువగా చేస్తున్నారు. నా పేరు సూర్యలో అల్లు అర్జున్ తండ్రిగా నటించారు. నితిన్ లై, విజయ్ లియో, అజిత్ పట్టుదలలో నెగటివ్ షేడ్స్ చేశారు. ఇక సపోర్టింగ్ క్యారెక్టర్ల జాబితా చాలా పెద్దది. మామూలుగా ఇలా కెరీర్ సెకండ్ ఇన్నింగ్స్ లో సోలో హీరోగా మళ్ళీ ట్రాక్ లోకి రావడం కష్టం. అందుకే శ్రీకాంత్, జగపతిబాబు, మోహన్ బాబు లాంటి సీనియర్లు ఎప్పుడో తమ మీదే కథ నడవాలనే రూల్ పక్కన పెట్టేశారు. కానీ అర్జున్ విషయంలో వేరే జరుగుతోంది. ఇటీవలే విడుదలైన బ్లాస్ట్ జోన్ మంచి వసూళ్లు రాబడుతోంది. కేవలం పదిహేను కోట్లతో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ ఫైనల్ రన్ అయ్యేలోపు యాభై కోట్లు దాటడం ఖాయమని ఇన్ సైడ్ టాక్. నెట్ ఫ్లిక్స్ రూపంలో పెట్టుబడి మొత్తం రిలీజ్ ముందే వెనక్కు వచ్చేసిందట. ఇప్పుడు లాభాల దిశగా వెళ్తోంది. కరుప్పు మంచి స్వింగ్ లో ఉన్నప్పుడే బ్లాస్ట్ కి ఇంత స్పందన రావడం ఊహించని పరిణామం. ఈ వారంలో పెద్ది లేకపోయి ఉంటే ఇంకా బలమైన రన్ దక్కేదేమో కానీ మొత్తానికి అర్జున్ లో సత్తా అయిపోలేదని చెప్పడానికి ఈ సినిమా బాగా ఉపయోగపడుతోంది. ఒకప్పుడు చిరంజీవి శ్రీమంజునాథ, కృష్ణవంశీ శ్రీ ఆంజనేయం, జగపతిబాబు హనుమాన్ జంక్షన్ లాంటి స్ట్రెయిట్ సినిమాలు ఎక్కువ చేసిన అర్జున్ ఇటీవలే కూతురు ఐశ్వర్యని డైరెక్ట్ చేసిన సీత పయనంని కన్నడతో పాటు సమాంతరంగా తెలుగులోనూ నిర్మించారు. కాకపోతే అనుకున్నదాని కన్నా పెద్ద ఫ్లాప్ అయ్యింది.




## చరణ్ లైనప్ లో పెద్ది ఇంపాక్ట్



పెద్ది ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో మరో చాలెంజ్ లాంటి ప్రాజెక్టు తర్వాత వచ్చిన గ్లోబల్ ఇమేజ్‌ని నిలబెట్టుకోవాలి. అదే టైమ్‌లో సోలో మార్కెట్‌ని మళ్లీ ప్రూవ్ చేసుకోవాలి. 'గేమ్ ఛేంజర్' ఫలితం అనుకున్నంతగా వర్కౌట్ కాకపోవడంతో 'పెద్ది' మీద భారం మరింత పెరిగింది. ఈ ఒక్క సినిమా చరణ్ నెక్ట్స్ 5 ఏళ్ల లైనప్‌ని డిసైడ్ చేస్తుంది. ఇప్పుడు చరణ్ టేబుల్ మీద మూడు పెద్ద పేర్లు ఉన్నాయి. ఇప్పటికే సుకుమార్ తో కాంబినేషన్ ఫిక్స్ అయ్యింది. ఇక ఆ తరువాత ప్రశాంత్ నీల్, సంజయ్ లీలా భన్సాలీ లాంటి వారితో చర్చలు జరుగుతున్నాయి. అనుకున్నట్లు కాంబినేషన్ సెట్ అవ్వాలి అంటే ముందు చరణ్ స్ట్రాంగ్ మార్కెట్ పై మరింత పట్టు సాధించాలి. సుకుమార్ 'పుష్ప'తో బ్రాండ్ అయ్యాడు. ఈ కాంబినేషన్ లో హిట్ కొట్టడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇక నీల్ 'ఖ+ఖీ, సలార్'తో మాస్ డైరెక్టర్‌గా ఫిక్స్ అయ్యాడు. భన్సాలీతో సినిమా అంటే నేషనల్ అవార్డు రేసు. ఈ ఇద్దరిలో ఎవరితో ఫస్ట్ సెట్ అవుతాడనేది 'పెద్ది' రిజల్ట్ మీదే ఆధారపడి ఉండవచ్చు. పెద్ది హిట్ అయితే చరణ్‌కి బేరసారాల పవర్ వస్తుంది. రెమ్యునరేషన్, షేర్స్, రిలీజ్ డేట్ మీద పట్టు ఉంటుంది. కానీ ఫలితం తేడా వస్తే సీన్ రివర్స్ అవుతుంది. అప్పుడు చరణ్‌కి ఆప్షన్స్ తగ్గుతాయి. స్టార్ డైరెక్టర్లు రిస్క్ తీసుకోరు. బడ్జెట్ కంట్రోల్, సబ్జెక్ట్‌లో మార్పులు అడుగుతారు. సీనియర్ల కెరీర్‌లో ఇదివరకే ఇది చూశాం. ఒక్క ఫ్లాప్ వల్ల రెండేళ్లు వెనక్కి వెళ్లిన వారు ఉన్నారు. చరణ్‌కి ఆ పరిస్థితి రాకూడదంటే పెద్ది కచ్చితంగా ఆడాలి. ఏదేమైనా బుచ్చిబాబు ఈ ప్రెజర్‌ని హ్యాండిల్ చేస్తున్న తీరు కీలకం. 'ఉప్పెన' టైమ్‌లో ఎలాంటి అంచనాలు లేవు. ఇప్పుడు చరణ్ స్టార్‌డమ్, రెహమాన్ మ్యూజిక్, రత్నవేలు కెమెరా అన్నీ భారీగానే ఉన్నాయి. విలేజ్ స్పోర్ట్స్ డ్రామా కాబట్టి క్లాస్, మాస్ రెండింటికీ రీచ్ అవుతుంది. ఎమోషన్ వర్కౌట్ అయితే 'రంగస్థలం' తర్వాత చరణ్‌కి మరో సోలో బ్లాక్‌బస్టర్ పడుతుంది. కాబట్టి పెద్ది చరణ్ కెరీర్‌కి డైరెక్షన్ ఇచ్చే ప్రాజెక్ట్. హిట్ అయితే అనుకున్న భారీ కాంబినేషన్ ప్లాన్ స్మూత్‌గా వెళుతుంది. తేడా వస్తే లైనప్ మొత్తం తేడా కొడుతుంది. అందుకే ఇండస్ట్రీ మొత్తం పెద్ది ఫస్ట్ రిపోర్ట్ కోసం చూస్తోంది.

## అజిత్ సెట్టవ్వకపోతే.. టాలీవుడ్ హీరో..



మార్క్ ఆంటోనీ, గత ఏడాది అజిత్ తో వచ్చిన గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలతో తమిళ దర్శకుడు అధిక్ రవిచంద్రన్ కమర్షియల్ డైరెక్టర్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. అజిత్ తో సినిమా పూర్తయిన వెంటనే మళ్లీ అదే కాంబినేషన్ రిపీట్ అవుతుందని అందరూ అనుకున్నారు. కానీ అలా జరగలేదు. దీంతో ఈ దర్శకుడు నెక్స్ట్ ఏ హీరోతో సెట్స్ మీదకు వెళ్తాడనే దానిపై రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. అజిత్ గత ఏడాది విడాముయర్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలతో ఆడియన్స్ ముందుకు వచ్చాడు. ఆ రెండు ప్రాజెక్ట్స్ కంప్లీట్ అవ్వడంతో అధిక్ తో కొత్త సినిమా అనౌన్స్ మెంట్ వస్తుందని కోలీవుడ్ వర్గాలు భావించాయి. కానీ అజిత్ తన కొత్త లైనప్ విషయంలో ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. మొదట రెమ్యునరేషన్ విషయంలో ఆలస్యం జరిగినట్లు టాక్ వచ్చింది. ఆ తరువాత అజిత్ ఇష్టమైన రేసింగ్ కోసం దుబాయ్ వెళ్ళాడు. ఇక రీసెంట్ గా అతని మాతృమూర్తి కన్నుమూశారు. దీంతో అతను ఇప్పట్లో షూటింగ్ కి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇక అధిక్ కు ఎదురుచూపులు తప్పడం లేదు. గ్యాప్ తీసుకోవడం ఇష్టం లేని ఈ దర్శకుడు, టైమ్ వేస్ట్ కాకుండా వేరే ఆప్షన్స్ వెతుకుతున్నాడు. సరిగ్గా ఈ టైమ్ లోనే టాలీవుడ్ మాస్ స్టార్ నందమూరి బాలకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. బాలయ్య ఇమేజ్ కు సరిపోయే ఒక పక్కా మాస్ కథను అధిక్ సిద్ధం చేశాడనే ప్రచారం జరుగుతోంది. ఇక యువ దర్శకులకు ఛాన్సులు ఇవ్వడానికి బాలయ్య ఎప్పుడూ ముందుంటాడు. అధిక్ యాక్షన్ టేకింగ్ బాలయ్యకు కరెక్ట్ గా సెట్ అవుతుందని, ఈ ప్రాజెక్ట్ ఓకే అయితే తెలుగులో ఒక సాలిడ్ ఎంట్రీ దొరుకుతుందని చెప్పవచ్చు. మార్కెట్ లెక్కల ప్రకారం చూస్తే అధిక్ ఫస్ట్ ఛాయిస్ కచ్చితంగా అజిత్ ప్రాజెక్ట్ కే ఉంటుంది. స్టార్ హీరోతో కోలీవుడ్ లో సినిమా చేస్తే వచ్చే క్రేజ్ వేరు. అజిత్ డేట్స్ ఇవ్వడానికి మరీ ఎక్కువ టైమ్ పడుతుంది అని క్లారిటీ వస్తేనే, టాలీవుడ్ ప్రాజెక్ట్ మీద ఫోకస్ చేసే అవకాశం ఉంది. చూడాలి మరి, మరో తమిళ దర్శకుడితో టాలీవుడ్ హీరో సెట్టవుతాడా లేదా అనేది. ప్రస్తుతం బాలకృష్ణ గోపిచంద్ మలినేనితో ఒక సినిమా చేస్తున్నాడు. మరోవైపు కొరటాల ప్రాజెక్టు కూడా లైన్ లో ఉంది.



# బిజినెస్ న్యూస్



## సోలార్ దిగుమతులపై నేటి నుంచి కొత్త రూల్స్.. వినియోగదారులపై భారం



దేశీయంగా సోలార్ తయారీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం భారత్ సోలార్ ప్యానెళ్లను అసెంబుల్ చేయగలుగుతున్నప్పటికీ, వాటిలో వాడే సెల్స్ కోసం ఎక్కువగా చైనా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. దేశంలో ప్రస్తుతం ఏటా 50+జీ సోలార్ సెల్స్ అవసరం ఉండగా.. దేశ ఉత్పత్తి సామర్థ్యం కేవలం 25–30 +జీ మాత్రమే ఉంటోంది. మిగతావి దిగుమతి చేసుకుంటున్నాం. ప్రభుత్వం తీసుకొచ్చిన 'దేశీయ' నిబంధన వల్ల మన దేశంలో సోలార్ సెల్స్ తయారీ కంపెనీలు ఎక్కువ పెట్టుబడులు పెట్టి, ఉత్పత్తిని పెంచుతాయని కేంద్రం భావిస్తోంది.

**వినియోగదారులపై భారం**

ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ పెట్టుకునే వినియోగదారులపై భారం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దేశంలో తయారయ్యే సోలార్ సెల్స్ ధర, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వాటి కంటే ఎక్కువ. ఈ కారణంగా రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ధర కిలోవాట్‌కు సుమారు రూ.3వేలు వరకు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవేళ 5 కిలోవాట్ల సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఆ మేర రూ.15వేలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

'పీఎం సూర్యఘర్' పథకం కింద ఇచ్చే ప్రభుత్వ సబ్సిడీ యథాతథంగా కొనసాగినప్పటికీ.. ఇకపై అందుకు వాడిన ప్యానెళ్లు నిబంధనల ప్రకారం ఉన్నాయో లేదో తనిఖీ చేస్తారు. దేశీయంగా డిమాండ్‌కు సరిపడా సోలార్ సెల్స్ ఉత్పత్తి లేకపోవడం వల్ల తాత్కాలికంగా కొరత ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల చిన్న చిన్న సోలార్ కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ సవాళ్లు తాత్కాలికమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుందామని అనుకుంటున్నారా? అయితే, ఇకపై ఈ ప్రాజెక్ట్‌కు కాస్త ఎక్కువ ధర చెల్లించాల్సి రావొచ్చు. కొన్ని సోలార్ ప్రాజెక్ట్‌లకు దేశీయంగా తయారైన సోలార్ సెల్స్ మాత్రమే వినియోగించాలన్న నిబంధనను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడమే దీనికి కారణం. చైనా నుంచి దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సూర్యరశ్మిని విద్యుత్‌గా మార్చడంలో సోలార్ సెల్స్ కీలకం. సోలార్ ప్రాజెక్ట్‌లో పలు సెల్స్‌తో కూడిన ప్యానెళ్లు లేదా మాడ్యూళ్లను ఇంటిపై/బయట ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు సోలార్ ప్రాజెక్టులకు దేశీయంగా తయారైన మాడ్యూళ్లనే వాడాలనే నిబంధనను కేంద్రం తీసుకొచ్చింది. తాజాగా పీఎం సూర్యఘర్ పథకం సహా వ్యాపారులు, పరిశ్రమలు వినియోగించే ఓపెన్-యాక్సెస్ సోలార్ ప్రాజెక్టులకూ ఈ నిబంధనను విస్తరించింది. దీంతో జూన్ 1 నుంచి ప్రభుత్వ ఆమోదం పొందిన తయారీదారుల నుంచే మాడ్యూళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

**ఎందుకీ నిర్ణయం**

## ఆరంభ లాభాలు ఆవిరి.. 508 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ట్రేడైన సూచీలు.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. దీంతో వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ సూచీలు నష్టపోయాయి. పశ్చిమాసియాలోని శాంతిపై అనిశ్చితి నెలకొనడం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం స్టాక్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 75,203.02 (క్రితం ముగింపు 74,775.74) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,367.93 వద్ద గరిష్ఠాలను తాకిన సూచీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 508.40 పాయింట్ల నష్టంతో 74,267.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.15 పాయింట్ల నష్టంతో 23,382.60 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.97గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, ఇండిగో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94.01 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4,496 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## మే నెల యూపీఐ లావాదేవీల్లో సరికొత్త రికార్డు





యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీల్లో సరికొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది మే నెలలో రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. సంఖ్యా పరంగా 2,320 కోట్ల లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. వేసవి ప్రయాణాలకు ఐపీఎల్ సీజన్ తోడవ్వడం యూపీఐ లావాదేవీలు పెరగడానికి కారణమయ్యాయి.

ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.29.03 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరగ్గా.. గతేడాది మే నెలలో రూ.25.14 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగాయి. ఏడాదిలో 19 శాతం వృద్ధి నమోదైందని ఎన్‌పీసీఐ తెలిపింది. గతేడాది ఇదే సమయంలో 1867 కోట్లుగా ఉన్న లావాదేవీల సంఖ్య ఏకంగా 24 శాతం వృద్ధితో 2320 కోట్లకు చేరి సరికొత్త రికార్డు నమోదైందని పేర్కొంది.

వేసవి సెలవుల్లో ప్రయాణాలు, ఐపీఎల్ ఫీవర్, సీజన్ పరంగా జరిగే లావాదేవీల కారణంగా ఈ స్థాయిలో యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయని క్యాష్‌ఫ్రీ పేమెంట్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆకాశ్ సిన్హా పేర్కొన్నారు. ఇది నెలవారీ యూపీఐ లావాదేవీల వృద్ధిని సూచిస్తోందని తెలిపారు. 2021లో యూపీఐ సగటు లావాదేవీ మొత్తం (టికెట్ సైజ్) రూ.1848గా ఉండగా.. 2025 నాటికి రూ.1313కు తగ్గినట్లు ఆర్‌బీఐ నివేదిక ఇటీవల వెల్లడించింది. ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూపీఐ ఎకోసిస్టమ్ బలోపేతం అవుతుందనడానికి సంకేతమని ఆకాశ్ సిన్హా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వైవిధ్యంతో కూడిన పెట్టుబడులు




ఈక్విటీల్లో చక్కని వైవిధ్యంతో ఇన్వెస్ట్ చేసుకోవాలని భావించే వారికి మల్టీ క్యాప్ ఫండ్స్ మంచి ఆప్షన్. పెట్టుబడులకు స్థిరత్వం కోసం లార్జ్‌క్యాప్, అధిక రాబడుల కోసం మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మధ్య పెట్టుబడులను విస్తరించడం ద్వారా దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మెరుగైన రాబడులను అందించేవే మల్టీక్యాప్ ఫండ్స్. ఇన్వెస్టర్లు తమ అంతటగా లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో మెరుగైన పథకాలను ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేయడం కంటే మంచి మల్టీక్యాప్‌ను ఎంపిక చేసుకోవడమే చక్కని ఆప్షన్ అవుతుంది. కనీసం ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలానికి.. మధ్యస్థం నుంచి అధిక రిస్క్ తీసుకోగలిగితే ఇన్వెస్టర్లకు మల్టీ క్యాప్ ఫండ్స్ అనుకూలం.

రాబడులు.. ఈ పథకం 2023 జనవరి 30న ప్రారంభం కాగా, నాటి నుంచి ఏటా 23.4 శాతం చొప్పున రాబడిని (పాయింట్ టు పాయింట్) అందించింది. ఇదే కాలంలో మల్టీక్యాప్ ఫండ్స్ విభాగం సగటు వార్షిక రాబడి 18.3 శాతంగానే ఉంది. ఇది మెరుగైన పనితీరును తెలియజేస్తోంది. రోలింగ్ రాబడులు (వివిధ దశల్లో పెట్టుబడులు) సైతం మూడేళ్ల కాలంలో 23 శాతం చొప్పున ఉన్నాయి. మూడేళ్ల సిప్ పనితీరును గమనిస్తే ఏటా 12.8 శాతం చొప్పున రాబడి నమోదైంది. మార్కెట్లో ఎన్నో అనిశ్చితులు నెలకొన్నప్పటికీ గడిచిన ఏడాది కాల రాబడి 6.45 శాతంగా నమోదైంది. పెట్టుబడుల విధానం.. మల్టీక్యాప్ ఫండ్స్ అన్నవి లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. ఈ పథకంలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఎక్కువ. ప్రస్తుతం ఈ పథకంలో 96 స్టాక్స్ ఉండడం దీన్నే సూచిస్తోంది. పోర్ట్‌ఫోలియోలోని టాప్--10 కంపెనీల్లో పెట్టుబడులు 23.19 శాతం మించలేదు. ఇది కూడా రిస్క్ వైవిధ్యంలో భాగమే. సెబీ నిబంధనల ప్రకారం అయితే మల్టీక్యాప్ ఫండ్స్ కనీసం 25 శాతాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో, 25 శాతాన్ని మిడ్‌క్యాప్ కంపెనీల్లో, 25 శాతం స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మిగిలిన 25 శాతం నిధులను మార్కెట్ పరిస్థితుల ఆధారంగా ఫండ్ మేనేజర్ తన విచక్షణ మేరకు ఎక్కడైనా ఇన్వెస్ట్ చేయొచ్చు. మార్కెట్ పరిస్థితులను బట్టి వివిధ రకాల స్టాక్స్ వేర్వేరు సమయాల్లో రాణిస్తాయి. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్న తరుణంలో లార్జ్‌క్యాప్ కంటే మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీలు బాగా రాణిస్తాయి. అదే మార్కెట్ పతనమవుతున్న పుడు లార్జ్‌క్యాప్‌లో నష్టాలు పరిమితంగా ఉంటాయి. మల్టీ క్యాప్ ఫండ్స్ వల్ల అన్ని కాలాల్లోనూ లాభపడే అవకాశం ఉంటుంది. ఈ పథకానికి వ్యాల్యూరీసెర్చ్ సంస్థ 5 స్టార్ రేటింగ్ ఇచ్చింది.

## తాడుతో ఆటోను లాగుతూ ...
# ఆటో డ్రైవర్ల వినూత్న నిరసన



**విజయనగరం, జూన్ 01 (నేటి మన దేశమ్) :** జూన్ 1 న డ్రైవర్లు డే సందర్భంగా .... ఆటో డ్రైవర్లకు ఉపాధిని దెబ్బ తీసే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపును ఉపసంహ రించు కోవాలని డిమాండ్ చేస్తూ .... ఆటోలకి తాడు కట్టి లాగుతూ సిఐటియు వినూత్న నిరసన కార్యక్రమం సోమవారం స్థానిక కోట జంక్షన్ వద్ద చేపట్టారు. శ్రీ కనకదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ .... ఒకవైపున ఊబర్, ఓలా వచ్చి ఆటోలకి ఉపాధి ని దెబ్బ కొడుతుంటే, మరోవైపు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఉన్న కొద్ది పాటి ఉపాధి లేక నానా యాతన పడుతున్న ఆటో డ్రైవర్లకు మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఉందన్నారు. కేంద్రంలో ఎన్ డి ఎ ప్రభుత్వం ఒక్క సారి పది రోజుల గ్యాపులో అనేక మార్లు పెట్రోల్, డిజల్ ధరలు పెంచిందన్నారు. దీని వలన ప్రస్తుతం రాష్ట్రంలో పెట్రోల్ లీటర్ 137 రూపాయలు అయ్యింది, ఇది ఆటో డ్రైవర్లకు మోయలేని భారమన్నారు. రాష్ట్రములో కూటమి అధికారం లోకి వచ్చిన నుండి ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలు కూడా అందరికి ఇవ్వకుండా ఇబ్బందులకి గురి చేస్తుందని ఆవేదన చెందారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాపిత ఉద్యమం నడుపుతామని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి. బి. రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నాయాకులు పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

# గంభీరంలో జల క్రీడా పోటీల ఎంపికలు



**ఆనందపురం జూన్ 01 (నేటి మన దేశమ్) :** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో జల క్రీడ విభాగానికి సంబంధించిన పలు క్రీడా పోటీల ఎంపికలు గంభీరం జలాశయంలో సోమవారం ఉదయం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 40 మంది క్రీడాకారులు బాలుర అండర్ 14, అండర్ 17 విభాగాల్లో పాల్గొన్నారు. వీరికి కయాకింగ్, బనానా బోట్ రైడ్ క్రీడల్లో ఎంపికలు నిర్వహించారు. క్రీడా పోటీలలో పాల్గొన్న అభ్యర్థులకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బలరాం నాయుడు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి, తదితరులు పాల్గొన్నారు. వాటర్ గేమ్స్ పోటీలతో గంభీరం జలాశయం వద్ద సందడి నెలకొంది.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంకు 02 అర్జీలు

**భీమునిపట్నం జూన్ 1 నేటి మనదేశమ్ :** జోన్-I జి వి ఎం సి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంకు 02 అర్జీలు వచ్చాయని జోనల్ కమిషనర్ విజయ కుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి- 01పట్టణ ప్రణాళిక విభాగానికి-01 తదుపరి చర్య లకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందని అన్నారు

## జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో
# ఈనెలంతా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్



**మైలవరం (కడప) జూన్ 01 (నేటి మన దేశమ్):** జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జూన్ నెలంతా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్-1861 అమలు చేస్తున్నట్లు జమ్మలమడుగు సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్డీపీఓ) కె.వెంకటేశ్వర రావు ప్రకటించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, వర్గ విభేదాలు, జాతరలు, ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు జూన్ 1 నుంచి జూన్ 30, 2026 వరకు జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించాలనుకునే వ్యక్తులు లేదా సంస్థలు కనీసం 24 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే బాణాసంచా, అగ్ని లేదా ప్రమాదకర పదార్థాల వినియోగానికి కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. నిర్వహించబోయే కార్యక్రమాల తేదీ, సమయం, మార్గం తదితర వివరాలను అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై పోలీస్ యాక్ట్ సెక్షన్ 32తో పాటు భారతీయ న్యాయ సంహిత (దీఛీూ) సెక్షన్ 223 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్డీపీఓ కోరారు.

# చదివిన బడినే చిదిమేస్తున్న యువకులు



**తొండూరు (కడప) జూన్ 01 (నేటి మన దేశమ్):** చదువు నేర్పిన బడినే లక్ష్యంగా చేసుకుని కొందరు యువకులు విధ్వంస కాండకు పాల్పడుతున్న ఘటన తొండూరు మండలం భద్రంపల్లెలో కలకలం రేపుతోంది. భద్రంపల్లె ప్రభుత్వ పాఠశాలలో వేసవి సెలవులను ఆసరాగా చేసుకుని గుర్తుతెలియని యువకులు ఆకతాయి చేష్టలకు దిగుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ ప్రాంగణానికి ఆడుకోవ డానికి వస్తున్న కొందరు యువకులు విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలను విరగ్గొట్టడం,గేట్ల తాళాలు ధ్వంసం చేయడం, టాయిలెట్లను పాడుచేయడం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి కల్పించిన మౌలిక సదుపాయాలు కొందరి నిర్లక్ష్య ధోరణి కారణంగా నిర్వీర్యమవుతున్నాయని,తాము చదువుకున్న పాఠశాలనే ధ్వంసం చేయడం బాధాకరమని గ్రామ పెద్దలు వాపోయారు. భవి ష్యత్తులో విద్యార్థులు తాగునీరు,పారిశుద్ధ్య సదుపాయాల కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ధ్వంసమైన కుళాయిల దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆస్తులను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని,పాఠశాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలని గ్రామస్తులు విద్యాశాఖ,పోలీసు అధికారులను కోరుతున్నారు. "పాఠశాలలు విద్యను అందించే దేవాలయాలు.. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది" అని గ్రామ పెద్దలు సూచించారు.

# పవన్ కళ్యాణ్‌కు పోలీసుల షాక్... నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ



**హైదరాబాద్,జూన్1 (నేటి మన దేశమ్) :** జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ కు స్ట్రాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు టీఆర్ఎస్ చీఫ్ కవిత. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.


Truhome FINANCE

DEMAND NOTICE

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోర్ నం.5, పాత నం.11, 2వ లేన్, సెనోటాఫ్ రోడ్, అల్వార్ పేట , తేనాంపేట, చెన్నై – 600018

హెడ్ ఆఫీస్: లెవెల్ 3, వోక్హార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ C-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబై – 400051 వెబ్‌సైట్: www.truhomefinance.in

ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) నుండి పొందిన రుణ సౌకర్యాల అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో ఈ క్రింది రుణగ్రహీతలు విఫలమ అయ్యారని మరియు పేర్కొన్న రుణ ఖాతాలను నిరర్థక ఆస్తులు (NPA)గా వర్గీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూరిటైజేషన్ మరియు రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI ACT)లోని సెక్షన్ 13(2) కింద వారికి డిమాండ్ నోటీసు జారీ చేయబడింది, వారి చివరి చిరునామాలో. పేర్కొన్న డిమాండ్ నోటీసుతో పాటు, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయబడు తున్నది.
సెక్షన్ 13(2) కింద పంపిన రుణగ్రహీతలు, సెక్యూరిటీలు, బకాయిలు, డిమాండ్ నోటీసుల వివరాలు మరియు అక్కడ క్లెయిమ్ చేయబడిన మొత్తం కింద ఇవ్వబడ్డాయి-

| రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ పేరు & చిరునామా | సురక్షిత ఆస్తుల ఆస్తి చిరునామా | డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం రూ. |
|---|---|---|
| శ్రీమతి.త్రిపుర మడల C/O వెంకట రత్నం శ్రీమతి మాదాల కస్తూరి W/O వెంకట రమణ డోర్ నెం. 39-3-37/2/1 ఫ్లాట్ నెం GF-1 కాంక్రీట్ అపార్ట్‌మెంట్లు మురళీ నగర్ కాంక్రీట్ అపార్ట్‌మెంట్స్ సాలగ్రామపురం విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ ఇండియా 530024 మరియు ఇంకా వద్ద ప్రస్తుతం గుంటూరు కొత్త మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేర్చబడిన గోరంట్ల గ్రామపంచాయతీ ప్రాంతం, గోరంట్ల గ్రామం తాలూకా ఫ్లాట్ నెం. 401, "శ్రీ వెంకటేశ్వర రెసిడెన్సీ" ఆంధ్రప్రదేశ్ – 522034) లోని మూడవ అంతస్తు రుణ మొత్తం - రూ.2970000 & 124249/- నిరర్థక ఆస్తి (NPA) తేదీ - 06-05-2026 ఖాతా నెం: SHLHVIWA0000961 & SULHVIWA0000962. | గుంటూరు \|\| కొరిటెపాడు సబ్ డి \|\| ప్రస్తుతం గుంటూరు కొత్త మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గోరంట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గోరంట్ల గ్రామం తాలూకా డి.నెం.59/1 రు మింజుమలే .0- 52 సెంట్ల భూమిలో 418-1/2 చ.మీ. శ్రీ మునిసిపల్ కార్పొరేషన్ యొక్క సిటీ ప్లానర్ ద్వారా T.S.A ద్వారా నాకు అందించబడింది. నం.101/2016/G3 రు. . ఎఫ్.ఎల్.ఆర్. నం. 54/2016/TS-II, తేదీ 04-02-2016, భూమి 363 చ.మీ. ఇది "శ్రీ వెంకటేశ్వర రెసిడెన్సీ" అపార్ట్‌మెంట్ సరిహద్దు- పగడాల వెంకయ్యమ్మ మొదలైన వారి ఆస్తికి తూర్పు సరిహద్దు. .108-00 , దక్షిణం: అంబటి రత్తమ్మ మరియు అంబటి రామయ్య గార్ల ఆస్తి సరిహద్దు. 34-0 పశ్చిమం: ధనాల విజయలక్ష్మి వారి ఆస్తి పరిమితి. 83-06, ఉత్తరం: 30 మీటర్ల వెడల్పు గల రోడ్డు సరిహద్దు. 42-0 ఈ సరిహద్దుల మధ్య, 363 చ.మీ. లేదా 303-50 చ.మీ. ఖాళీ స్థలం అందుబాటులో ఉంది. షెడ్యూల్ -బి పైన పేర్కొన్న "శ్రీ వెంకటేశ్వర రెసిడెన్సీ"లోని మూడవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెం. 401 యొక్క సరిహద్దులు మరియు 36-3 చ.మీ. లేదా 30-35 చ.మీ. కొలత గల, పేర్కొనబడని అవిభక్త భూభాగం ఈ క్రింది విధంగా ఉంది:- తూర్పు: ఆరుబయట, దక్షిణం: ఆరుబయట పశ్చిమం: ఆరుబయట, ఉత్తరం: ఉమ్మడి కారిడార్, మెట్లదారి & లిఫ్ట్ ఈ పరిమితులలో, "శ్రీ వెంకటేశ్వర రెసిడెన్సీ"లోని మూడవ అంతస్తులో ఉన్న సెమీ-ఫినిష్డ్ ఫ్లాట్ నెం. 401, 1040 చ.మీ. కొలత గల డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఉంది. సదరు ఫ్లాట్ యొక్క ఉమ్మడి ప్రాంతంతో సహా, 100 చ.మీ.ల కార్ పార్కింగ్ ప్రాంతం, సదరు ఫ్లాట్ యొక్క అన్ని నిర్దిష్ట ఆస్తులు, బోరు, మోటారు మరియు ఉమ్మడి ప్రాంతం, కార్ పార్కింగ్, ఉమ్మడి జనరేటర్‌తో సహా సదరు ఫ్లాట్ యొక్క అన్ని ఉమ్మడి మరియు సంయుక్త హక్కులు మరియు సౌకర్యాలు, మరియు సదరు అపార్ట్‌మెంట్ యొక్క అన్ని లీజుహోల్డ్ మొదలైన హక్కులు. | డిమాండ్ నోటీసు తేదీ - 13-05-2026 డిమాండ్ నోటీసు మొత్తం రూ.2930743/-(ఇరవై తొమ్మిది లక్షల ముప్పై వేల ఏడు వందల నలభై మూడు రూపాయలు మాత్రమే) & రూ.124482/- (ఒక లక్ష ఇరవై నాలుగు వేల నాలుగు వందల ఎనభై రెండు రూపాయలు మాత్రమే) 31-05-2026 నాటికి లోన్ ఖాతా నెం. SHLHVIWA0000961 & SULHVIWA0000962 |
| 1.శ్రీ గంటి వి.వి.ఆర్.పుల్లేశ్వర రావు గంటా S/O వెంకటరావు 2.శ్రీమతి లక్ష్మి కళ్యాణి గంటా W/O వి.వి.ఆర్ పుల్లేశ్వర రావు గంట R/O డోర్ నెం. 9-54 తాడిమల్ల రామాలయం కటకోటేశ్వరం పశ్చిమ గోదావరి ఆంధ్ర ప్రదేశ్ భారతదేశం 534305 లోన్ మొత్తం -రూ.1467230 & 1121116 & 376098/- ఎన్‌పీఏ తేదీ - 06-05-2026 ఖాతా సంఖ్య: SBTHRJMD0000406 & SILHRJMD0000407 & SILHRJMD0000496 | పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలు సబ్-రిజిస్ట్రార్ పరిధి, నిడదవోలు మండలం, కటకోటేశ్వరం గ్రామ పంచాయతీ ప్రాంతములోని కటకోటేశ్వరం గ్రామం,తాడిమళ్ల హామ్లెట్‌లో, ఆర్.ఎస్. నెం. 954/7లో, డోర్ నెం. 10-54 సమీపంలో, అసెస్‌మెంట్ నెం. 224 గల స్థలములో 192½ చదరపు గజాలు (160.95 చదరపు మీటర్లు) విస్తీర్ణం గల ఆస్తి, క్రింది హద్దులతో కలదు: హద్దులు: తూర్పు: రోడ్డు – 11 గజాలు పశ్చిమం: కొత్తగుంట సత్యనారాయణ మరియు ఇతరుల స్థలం – 11 గజాలు ఉత్తరం: కొత్తగుంట సత్యనారాయణ మరియు ఇతరుల ఇల్లు – 17 గజాలు దక్షిణం: రోడ్డు – 11 గజాలు పై హద్దుల మధ్యనున్న 192½ చదరపు గజాలు లేదా 160.95 చదరపు మీటర్ల స్థలముతో పాటు, దానికి సంబంధించిన అన్ని సాధారణ హక్కులు, ఈజ్‌మెంట్ (సౌలభ్య) హక్కులు మరియు ఇతర అనుబంధ హక్కులు సహా మొత్తం ఆస్తి. | డిమాండ్ నోటీసు తేదీ - 13-05-2026 డిమాండ్ నోటీసు కోరిన మొత్తం ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు మీ బాధ్యతలను పూర్తిగా తిరిగి చెల్లించి, తీర్చవలసిందిగా కోరబడింది, 31-05-2026 నాటికి లోన్ ఖాతా నెం. SBTHRJMD0000406 & SILHRJMD0000407 & SILHRJMD0000496 రిఫరెన్స్ క్రింద మొత్తం రూ.1527913/- (పదిహేను లక్షల ఇరవై ఏడు వేల తొమ్మిది వందల పదమూడు మాత్రమే) & రూ.1181392/- (పదకొండు లక్షల ఎనభై ఒక్క వేల మూడు వందల తొంభై రెండు మాత్రమే) & రూ.409530/- (నాలుగు లక్షల తొమ్మిది వేల ఐదు వందల ముప్పై మాత్రమే). |

రుణగ్రహీతలైన మీరు, పైన పేర్కొన్న బకాయిలను ఈ నోటీసు అందిన 60 రోజులలోపు పూర్తిగా చెల్లించవలసిందిగా కోరడమైనది. అలా చేయడంలో విఫలమైతే, పైన పేర్కొన్న సెక్యూరిటీలను అమలు చేయడానికి, SARFAESI చట్టం కింద చర్యలు తీసుకోవలసిన బాధ్యత నాపై ఉంటుంది. దయచేసి గమనించండి, సదరు చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, మా అనుమతి లేకుండా పైన పేర్కొన్న సెక్యూరిటీలను అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయడానికి మీకు అనుమతి లేదు. 25-మే-2026న ప్రచురించబడిన ఆ మునుపటి వేలం ఉపసంహరించబడింది.

స్థలం: గుంటూరు/విశాఖపట్నం, రాజమండ్రి
తేదీ : 02.06.2026

సం /- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (మునుపటి పేరు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)


# ప్రజలకు మెరుగైన సేవలందించడమే ధ్యేయం

**నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.టి. సుధాకర్ ఆదేశాలు**





**కాకినాడ జూన్ 1 (నేటి మనదేశమ్) :** ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో వేగం పెంచేందుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశంలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, పోలీసు శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ, విద్యాశాఖ, పౌరసరఫరాల శాఖ, పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ, పట్టణ ప్రణాళిక విభాగం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో వివిధ శాఖల పనితీరు, ప్రజల్లో ఏర్పడుతున్న సానుకూల అభిప్రాయం, శాఖల వారీగా నిర్దేశించిన పనితీరు ప్రమాణాల అమలు స్థితిగతుల పై నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.టి. సుధాకర్ సమీక్షించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలంటే అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని, క్షేత్రస్థాయిలో అధికారులు తరచూ పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల వారీగా పనితీరు ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల అభిప్రాయం పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి కనబరిస్తే ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. రాబోయే సమీక్షా కాలంలో నియోజకవర్గ స్థాయిలో పనితీరు ప్రమాణాలు మరియు ప్రజా సంతృప్తి సూచికల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.టి. సుధాకర్ స్పష్టం చేశారు.

# పంట బోదుల్లోకి దిగి ఉపాధి శ్రామికులకు మజ్జిగ అందజేసిన మంత్రి నిమ్మల



**పాలకొల్లు, జూన్ 01 (నేటి మనదేశమ్) :** పాలకొల్లు మండలంలోని వేలివెల గ్రామంలో ఉపాధి హామీ శ్రామికులకు మంత్రి నిమ్మల రామానాయుడు మజ్జిగను అందజేశారు. పంట బోదుల్లోకి దిగి అందులో పని చేస్తున్న శ్రామి కులకు స్వయంగా అందజేశారు. వేసవి మండుటెండలో పనిచేస్తున్న వారికి ప్రతిరోజు మజ్జిగను దాతలు సహకారంతో తెదేపా శ్రేణులు అందజేయాలని మంత్రి నిమ్మల ఇచ్చిన పిలుపుతో గ్రామ గ్రామాన ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి ఒక్కరితో మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ మీకు ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్వచ్ఛమైన పల్లెల్లో మంచి మనసుతో మెలిగే ప్రజలంటే తనకు మమకారం అని, ఆ ఉద్దేశంతోనే గత ఏడాది వేసవిలో మజ్జిగను అందజేయడంతో శ్రామికులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారని, దీంతో ఈ ఏడాది కూడా కొనసాగేలాగా పిలుపునిచ్చానన్నారు. ఉపాధి శ్రామికులకు మజ్జిగ నా అందజేయడం తనకు ఎంతో సంతృప్తి, ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



**ఆమదాలవలస జూన్ 01 (నేటి మనదేశమ్) :** అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మున్సిపాలిటీ 12వ వార్డు లక్ష్మీ నగర్ మార్కెట్ ప్రాంతాల్లో సోమవారం ఆయన ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి రవి, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, వార్డు ఇన్‌ఛార్జ్ బోయిన సునీత, రాష్ట్ర లీగల్ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## గోశాల ముసుగులో పశువుల అక్రమ రవాణాకు చెక్

**విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్**




**విజయనగరం జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలోని గుర్ల మండలం గుజ్జింగవలసలోని ఓంశక్తి గోశాల నిర్వహణ పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణపై విచారణ చేపట్టి, పశువుల అక్రమ రవాణాకు పాల్పడినట్లుగా గుర్తించి, అతడిపై గుర్ల పోలీసు స్టేషన్ లో ఇప్పటికే పలు కేసులు నమోదు చేసినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సోమవారం మాట్లాడుతూ - గుర్ల మండలం గుజ్జింగవలసలో ఓంశక్తి గోశాల నిర్వహిస్తున్న అట్టాడ రామకృష్ణపై ఇటీవల కొన్ని ఫిర్యాదులు రావడంతో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులును విచారణ చేపట్టాలని ఆదేశించామన్నారు. డీఎస్పీ రాఘవులు, చీపురుపల్లి సిఐ జి.శంకరరావు, గుర్ల ఎస్ఐ పి.నారాయణరావు విచారణ చేపట్టగా ఓంశక్తి గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లుగా వెల్లడైందన్నారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వివిధ పోలీసు స్టేషన్ పరిధిలో పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి, పోలీసులు స్వాధీనం (పట్టుకున్న) చేసుకున్న పశువులను సంరక్షించేందుకు గుజ్జింగవలస గ్రామంలోని ఓంశక్తి గోశాలకు అప్పగిస్తున్నామన్నారు. కానీ, సదరు గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణ పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న నిందితులతో కుమ్మక్కై, వివిధ పోలీసు స్టేషన్ అధికారులు సీజ్ చేసి, అప్పగించిన పశువులను తిరిగి పశువుల అక్రమ రవాణాదారులకే విక్రయిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైందన్నారు. అంతేకాకుండా, గోశాలలో పశువుల సంరక్షణకు చేపట్టాల్సిన రక్షణ చర్యలు తీసుకోకుండా పశువులకు అవసరమైన నీరు, ఆహారం వంటి కనీస అవసరాలు తీర్చకుండా, సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లుగా, నిబంధనలను తుంగలో త్రొక్కినట్లుగా గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న గోశాల నిర్వాహకుడు అట్టాడ రామకృష్ణ పై ఇప్పటికే పలు కేసులు నమోదు చేశామని, గోశాల అనుమతులు రద్దు చేసేందుకు సిఫార్సు చేసినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం ఓంశక్తి గోశాలలో ఉన్న 79 పశువులను సీజ్ చేసి, గరివిడిలో నూతనంగా నిర్మించిన మరో గోశాల కు తరలించి, వాటి సంరక్షణ బాధ్యతలను అక్కడ నిర్వాహకులకు అప్పగించామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. గోశాల నిర్వహణ ముసుగులో అక్రమాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని డయల్ 112/100 కు అందించాలని, పశువుల అక్రమ రవాణ నియంత్రణకు పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

## రైతు రక్షణ, నీటి నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక కోరిన బీజేపీ



**భీమవరం జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :**బీజేపీ ఆధ్వర్యంలోని జనతా-వారధి జిల్లా కన్వీనర్ తోట గంగరాజు, కో కన్వీనర్లు ఇంజేటి వెంకటేశ్వర్లు, గాదిరాజు వెంకటేశ్వరరాజుల నేతృత్వంలోని ప్రతినిధి బృందం, ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో రైతు రక్షణ, నీటి నిర్వహణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి సోమవారం వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కృష్ణంరాజు, ప్రసాద్, సుబ్బరాజు, పుండరీకాక్ష, నాగరాజు, మల్లేశ్వరరావు, వెంకటేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలో ఈ సంఘటన జరిగింది.

## ఖైదీ కుమారునికి రూ. 5 లక్షల పరిహార చెక్కు అందజేత



**మచిలీపట్నం జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అవనిగడ్డ సబ్ జైలులో మే 6, 2023న రిమాండ్ ఖైదీగా ఉంటూ మృతి చెందిన పులి కోటేశ్వరరావు అలియాస్ కోటి (వీర్రాజు కుమారుడు) కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 5 లక్షల పరిహారాన్ని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నంలోని తన ఛాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాధితుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# యువత ప్రశ్నించడం ఆయుధంగా మార్చుకోవాలి

**- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ**



**నరసరావుపేట జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** లౌకిక ప్రజాస్వామ్య దేశంలో యువత ప్రశ్నించడం ఆయుధంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సోమవారం మండలంలోని కోటప్పకొండ షిరిడి సాయిబాబా కళ్యాణ మండపంలో జరిగిన అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం లో తొలి రోజు ఆమె ప్రసంగించారు. ఈ సమ్మేళనానికి ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. తప్పు చేసిన బాబాలను బయటకు వదిలేసి ప్రశ్నించే యువతను జైళ్ళ పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత సరైన మార్గం, మంచి ఆలోచనలతో ముందుకు వెళ్లకపోతే ఈ దేశం ఎటువైపు పయనిస్తుందోననే భయం వ్యక్తం చేశారు. సైద్ధాంతిక భావాలు, ఆలోచనలను యువత అలవర్చుకోవాలన్నారు. నాటి నాయకుల త్యాగాల ఫలితమే నేడు మనం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లగలుగుతున్నామని తెలిపారు. ప్రస్తుత రాజకీయాలు సమాజాన్ని అభివృద్ధి వైపు నడిపించడంలో యువతపై పెద్ద భారం ఉందన్నారు. యంగ్ ఇండియా నిస్తేజం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత విష సంస్కృతి, నేర ప్రవృత్తిని విడనాడి సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. 79 సంవత్సరాల భారత స్వాతంత్ర్యానంతర కాలంలో ఇప్పుడున్న సమస్యలను గతంలో ఎప్పుడు చూడలేదన్నారు. విద్య, వైద్యం ప్రైవేటీకరణ పై యువత సమర శంఖం పూరించాలన్నారు. గతంలో పంచవర్ష ప్రణాళికల ద్వారా సమగ్ర అభివృద్ధిని సాధించామని గుర్తు చేశారు. త్యాగాలు చేసిన మహోన్నతులపై బురదచల్లడం అని చెప్పారు. స్వాతంత్ర ఫలాలు క్రింది స్థాయి వరకు అందితే, అంతకన్నా ఘనత మరొకటి లేదన్నారు. కొన్ని ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను తమ చేతుల్లోకి తీసుకొని యువతను, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. అంబేద్కర్ చెప్పినట్లు ఓటు హక్కు దేశంలో కీలకమైందని, అలాంటి ఓటు సక్రమంగా వినియోగించకపోతే మరో పోరాటం చేయాల్సి వస్తుందని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, సిపిఐ పల్నాడు జిల్లా సమితి కార్యదర్శి మారుతి వరప్రసాద్, సిపిఐ జిల్లా నాయకులు కాసా రాంబాబు, మాజీ ఏఐవైఎఫ్ నాయకులు వీరవల్లి వరదయ్య, న్యాయవాది సిహెచ్ ప్రతాప్, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, పిడిఎం నాయకులు నల్లపాటి రామారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాజర్ జి, మాల మహానాడు నాయకులు గోదా జాన్ పాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ హుస్సేన్, సిపిఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్, పల్నాడు జిల్లా నాయకులు వైదన వెంకట్, మహంకాళి సుబ్బారావు, సిహెచ్ నిర్మల, నర్సా హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు, జాగర్లమూడి హనుమంతరావు, భట్టిప్రోలు సత్యనారాయణ రాజు, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ప్రధాన లక్ష్యం

**- పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ**



**గన్నవరం, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిని అజెండాగా పెట్టుకుని ముందుకు సాగుతున్నానని, అలానే ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సోమవారం ఉంగుటూరు మండలం, ఉంగుటూరు గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు స్థానిక నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని అవ్వాతాతలు, దివ్యాంగుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్ నగదును అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40,521 మంది లబ్ధిదారులకు రూ.17.35 కోట్ల పెన్షన్ మొత్తాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిక్కవరం గ్రామంలో అక్రమంగా తవ్విన చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. చెరువును అక్రమంగా తవ్వి చిన్నారుల మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కామన్ సైట్స్‌పై అక్రమాణలపై ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటివరకు పని ప్రారంభించ లేదని ఘాటుగా స్పందించారు. ఈ అంశాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తా నని చెప్పారు. రామవరప్పాడులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ. 29 లక్షలతో నిర్మించిన రహదారిని త్వరలో ప్రారంభిస్తామని, దీని ద్వారా సుమారు 23 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అలాగే గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. బాపులపాడు మండలంలో 60 ఎకరాలు, గన్నవరం మండలంలో 39 ఎకరాల ప్రభుత్వ భూములను అధికారులు అన్యాక్రాంతం నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. బుడమేరు ప్రక్షాళనలో భాగంగా స్ట్రెయిటెనింగ్ చేపట్టడం ద్వారా విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న 150 ఎకరాల భూమి ప్రభుత్వానికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గన్నవరంలో రూ.200 కోట్ల పెట్టుబడితో సి-డాక్ (జ-ణూజ) కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దీనివల్ల ఐటీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్‌తో చర్చించనున్నట్లు చెప్పారు. త్వరలో గన్నవరంలో పి-4 కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీనికి అవసరమైన కంప్యూటర్లు, ఫర్నిచర్ ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. హెచ్‌సీఎల్ సంస్థ తన సిఎస్ఆర్ నిధుల నుంచి ప్రతి నెలా రూ.6 లక్షలు కేటాయిస్తున్నందుకు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉంగుటూరు గ్రామంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును జల్ జీవన్ మిషన్ పథకం కింద పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉంగుటూరు మండలంలోని రోడ్డు పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. అవసరమైతే సిఎస్ఆర్ నిధులను వినియోగించి అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, ఉంగుటూరు గ్రామ టిడిపి అధ్యక్షులు మారడా పాపారావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి మూల్పురి సాయి కళ్యాణి, ఏ.యం.సి వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, అరుమళ్ళ కృష్ణారెడ్డి, గొడ్డళ్ల చిన్న రామారావు, గోళ్ళ రంగారావు, ఈడ్పుగంటి కృష్ణమూర్తి, అరికట్ల రవి, రాజబోయిన శివాజీ, అమర్తల సోమేశ్వరరావు, వంగా అయ్యప్పరెడ్డి, మేడేపల్లి రమ, తుమ్మల లత, యర్రగుంట్ల వినోద్, మునిపల్లి నాగరాజు, చింత చంద్రశేఖర్, మల్లాల రంగారావు, ఉయ్యూరు మురళి, తేలు సత్యనారాయణ, పోతినేని రామకృష్ణ, శ్రీను, కొండా రాంబాబు, నక్కా వెంకటేశ్వరరావు, నాగేంద్ర, చల్లగాలి సునీల్, పొట్లూరి భువనేశ్వరి, గరిమెళ్ళ వరప్రసాద్, పోతినేని బాపయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**విజయవాడ , జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మెగా డీఎస్సీ పేరుతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువత ఆశలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో రామా క్లాత్ షో రూమ్ నుండి భారీ ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైస్సార్సీపీ నేతలు.. పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్,మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు,మొండితోక జగన్మోహన్ రావు,తిరువూరు ఇంచార్జ్ నల్లగట్ల స్వామిదాసు,జగ్గయ్యపేట ఇంచార్జ్ తన్నీరు నాగేశ్వర రావు,జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొరివి చైతన్య మరియు వైస్సార్సీపీ శ్రేణులు.. ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను పూర్తిగా మోసం చేసిందన్నారు. మెగా డీఎస్సీ అంటూ భారీ ప్రచారం చేసి, చివరకు అభ్యర్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిందని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డీఎస్సీ నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న అవకతవకలపై ప్రజలకు, నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "మెగా డీఎస్సీ" అని చెప్పి "దగా డీఎస్సీ"గా మార్చారని, ప్రభుత్వం చేపట్టిన విధానాలు అభ్యర్థులను తీవ్ర నిరాశకు గురిచేశాయని విమర్శించారు. డీఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై స్వతంత్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై సీఐడీ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత జీవితాలతో రాజకీయాలు చేయడం తగదని, ప్రజలను మోసం చేసిన ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. డీఎస్సీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాలు పారదర్శకంగా సాగలేదు అన్యాయం జరిగిన అభ్యర్థులు కోర్టుకు వెళ్లినా ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది సచివాలయ ఉద్యోగాలు వైసిపి హయాంలో చేపట్టాము...ఎక్కడ అవకతవకలు జరగలేదు డీఎస్సీ నియామకాలు పారదర్శకంగా జరిగాయి అన్న నమ్మకం మీకుంటే వాస్తవాలు చూపించండి ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య మాట్లాడుతూ... మెగా డీఎస్సీ పేరుతో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేసిందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు కొరివి చైతన్య విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తూ డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని డీఎస్సీ అభ్యర్థుల పక్షాన ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ,మండల,డివిజన్ స్థాయి పార్టీ హోదాల్లో ఉన్న నాయకులు, మాజీ కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షులు,యువజన విభాగం నాయకులు, నాయకులు,సోషల్ మీడియా నాయకులు,కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి తొలి ప్రాధాన్యత



**అవనిగడ్డ జూన్01 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, పేదల వైద్యానికి సీఎం చంద్ర బాబు తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తన నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 66,56,190ల సహాయం చెక్కులను పంపిణీ చేశారు.

# పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాలు

**రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం, జూన్ 1 (నేటి మనదేశమ్ ప్రతినిధి) :**పరిశ్రమల స్థాపన, మనుగడకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించి జిల్లాలోని పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆయన ముందుగా బొండపల్లి మండలం కొండకిండాంలో నిర్మితమవుతున్న ఎంఎస్ఎంఈ పార్కును సందర్శించారు. అక్కడి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాన్‌లో కొద్దిపాటి మార్పులు చేయాలని సూచించారు. అనంతరం విజయనగరంలోని తమ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని పారిశ్రామిక పార్కుల పరిస్థితి, ఎంఎస్ఎంఈ పార్కుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. విటి అగ్రహారం, నెల్లిమర్ల, కంటకాపల్లి, బొబ్బిలి పారిశ్రామిక పార్కుల వారీగా ప్రస్తుతం నడుస్తున్న యూనిట్లు, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. విటి అగ్రహారం పార్కులో విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, నెల్లిమర్ల పార్కులో విద్యుత్ ఓల్టేజ్ సమస్య, అప్రోచ్ రోడ్డును విస్తరణ, కంటకాపల్లి పార్కుకు రహదారి, బొబ్బిలి పార్కులో ఓల్టేజి సమస్య, మూతపడ్డ పరిశ్రమలు తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధిలో ఇండస్ట్రియల్ పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు ఎంతో కీలకమన్నారు. వీటిద్వారానే ఎక్కువమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత నిస్తోందని చెప్పారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు కావాలంటే, పారిశ్రామిక పార్కుల్లో తగిన వసతులు ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రహదారులు, విద్యుత్, కాలువలు, డ్రైన్లు తగిన వసతులను కల్పించాలని సూచించారు. జిల్లాలోని నాలుగు పారిశ్రామిక పార్కులను పరిశీలించి సమగ్ర నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసే పరిశ్రమలన్నీ ఒకే చోట ఏర్పాటు చేస్తే, క్లష్టర్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పారు. మామిడి పళ్లను ఎక్కువ రోజులు నిల్వ ఉండేవిధంగా ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రాసెసింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేందుకు భోగాపురం ప్రాంతంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఒక యూనిట్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. పిపిపి విధానంలో జిల్లా పరిశ్రమల కేంద్రం కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వం ఒక కొత్త పాలసీని రూపొందిస్తోందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కరుణాకర్, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ వి.కృష్ణప్రసాద్, జెఇఇ రాజేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రియల్ పార్కుల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and
Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com